క్లుప్తంగా

65 వాహనాలు స్వాధీనం

నిర్మల్‌టౌన్: వాహనాలకు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ అన్నారు. పట్టణ సీఐ పురుషోత్తం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో గురువారం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు, ధ్రువపత్రాలు లేని 65 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేటు లేకుండా తిరిగితే వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రామానుజన్ జయంతి



1729 ఆకారంలో విద్యార్థులు

భైంసారూరల్: మండలంలోని చింతల్‌బోరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సంఖ్య 1729 ఆకారంలో కూర్చొని వారి సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, విద్యార్థులు ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ కొండ్ర రేఖ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు నర్సాపూర్(జి) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లాడి వనజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల మండల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

విద్యార్థులకు మంచి భోజనం అందించండి



భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేశ్

ముధోల్: విద్యార్థులకు పోషకాలు కల్గిన మంచి భోజనం అందించాలని ఎంపీడీవో సురేశ్ బాబు అన్నారు. గురువారం మండలంలోని తరోడా గ్రామంలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి కార్మికులకు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీని పరిశీలించారు. ఈయన వెంట ఏపీవో శిరీష, సిబ్బంది ఉన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ప్రకటనలో తెలిపారు. బ్యాగు ధర రూ.270 గా ఉందని.. ఆసక్తి కల్గిన రైతులు శుక్రవారం పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, బ్యాంకు జిరాక్స్‌లతో కార్యాలయం రావాలని సూచించారు.

నారు పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



నారుమడి పరిశీలిస్తున్న ఏవో గణేశ్

లోకేశ్వరం: రైతులు వరినారు పెంపకంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి గణేశ్ అన్నారు. మండలంలోని రాజూర గ్రామంలో గురువారం వరి నారుమడిని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉదయం నారుమడికి నీటిని పెట్టి.. సాయంత్రం తీసేయాలని రైతులకు సూచించారు. నారు ఎదుగుదలకు ఎకరాకు సరిపడ రెండు కేజీల యూరియా, నాలుగు కేజీల కార్బండిజం, మైకోజం మిశ్రమంతో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. రాత్రి చలి పెరిగినందున నారుపై కర్రల సాయంతో టార్పాలిన్ కప్పాలని పేర్కొన్నారు. వారి వెంట ఏఈవో భూమేశ్ తదితరులున్నారు.

శుభ్రత పాటించాలి



రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యుడు

దస్తురాబాద్: రోగాల బారిన పడకుండా విద్యార్థులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని ఆరోగ్య విస్తరణాధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వంటగదిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్‌వో తిరుమల, రాజేందర్, మల్లేశం, భూమేశ్, రాధ, నర్మద తదితరులున్నారు.

‘పది’లో శతశాతం లక్ష్యం

- బీసీ, ఎస్సీ వసతిగృహాల్లోని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన వారిపై దృష్టి
- ఉత్తమ ఫలితాల సాధనకు ట్యూటర్ల నియామకం



కుంటాల వసతిగృహంలో చదువుతున్న విద్యార్థులు

కుంటాల: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉండి పదోతరగతి చదివే విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ట్యూటర్లను నియమించి ఉదయం గంటసేపు, సాయంత్రం గంట స్టడీ అవర్స్ నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా చర్చిస్తూ పరీక్షలంటే భయపడకుండా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపుతున్నారు.

నియోజకవర్గంలో 133 మంది..

నియోజకవర్గంలోని బీసీ వసతిగృహాల్లో 90 మంది, ఎస్సీ వసతిగృహాల్లో 44 మంది మొత్తం 133 మంది బాలలు పదో తరగతి చదువుతున్నారు. వీరు వసతిగృహంలో ఉంటూ సమీపంలోని పాఠశాలలకు వెళ్లి వస్తున్నారు. నియోజకవర్గంలోని బీసీ వసతిగృహాలున్న బాసరలో 05, లోకేశ్వరం మండలం మన్మద్‌లో10, తానూరు మండలం బోసిలో 40, కుంటాలలో 15, భైంసాలో 05, లోకేశ్వరంలో 15 మంది పదో తరగతి చదువుతున్నారు. ఎస్సీ వసతిగృహాలున్న లోకేశ్వరంలో 10, కుభీర్ 06, ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ 06, లోకేశ్వరం మండలంలోని గడ్‌చందా 05, బాసర 07, ముధోల్‌లో 10 విద్యార్థులు ఉన్నారు.

గణితం, ఇంగ్లిష్ ట్యూటర్ల ఏర్పాటు..

వసతిగృహాల్లో ఉండి చదువుకునే పేద విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందులో భాగంగా విద్యార్థులు కఠినంగా భావించే గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులకు ట్యూటర్లను నియమించారు. రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. దీంతో పరీక్షలంటే భయం తగ్గి చదువుపై ఆసక్తి కల్గుతుందని విద్యార్థులు అంటున్నారు.

అల్పాహారం అందిస్తూ..

10 జీపీఏ సాధించాలనే ఉద్దేశంతో రోజు ఉదయం, సాయంత్రం 6:30 నుంచి 7:30 గంటల వరకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు పాలు, బిస్కెట్స్, పల్లిపట్టీలు, సేమియాను అల్పాహారంగా అందిస్తున్నారు.

సందేహాలను నివృత్తి చేస్తున్నారు



మాది కుభీర్ మండలంలోని పల్సి గ్రామం. కుంటాలలోని బీసీ వసతిగృహంలో ఉంటూ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను హాస్టల్‌లో రివిజన్ చేయిస్తున్నారు. వార్డెన్ సార్ సైతం సందేహాలను నివృత్తి చేస్తూ మంచిగా చదవాలని ప్రోత్సహిస్తున్నారు.
– విశాల్, పదోతరగతి, కుంటాల

ఆత్మవిశ్వాసం పెరిగింది



మాది కుంటాల మండలంలోని అంబుగామ గ్రామం. కుంటాలలోని బీసీ వసతిగృహంలో ఉంటూ ఇక్కడే పదో తరగతి చదువుతున్నా. హాస్టల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండటంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. పరీక్షలంటే భయం పోయింది. చక్కగా చదివి మంచి మార్కులు సాధిస్తా.
– ఓంకార్, పదోతరగతి, కుంటాల

శ్రద్ధ తీసుకుంటున్నాం

రోజు ఉదయం, సాయంత్రం పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఆంగ్లం, గణితం, సైన్స్ సబ్జెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.
– నగేష్, వసతిగృహ సంక్షేమాధికారి, కుంటాల

ఉత్తమ ఫలితాల కోసం

వసతిగృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహిస్తున్నాం. పరీక్షలంటే భయం లేకుండా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపుతాం. ఉత్తమ ఫలితాల సాధనకు చర్యలు తీసుకుంటున్నాం.
– రాజేశ్వర్‌గౌడ్, జిల్లా బీసీ సంక్షేమాధికారి

ఎంపీలపై చర్యలు తీసుకోవాలని నిరసన

ఖానాపూర్: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కడ్‌ను హేళన చేసిన ఎంపీలపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బీజేపీ నాయకులు కళ్లకు నల్లగంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఘటనకు బాధ్యులైన టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీతో పాటు కాంగ్రెస్ ఎంపీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంకం మహేందర్, నాయిని సంతోశ్, టేకు ప్రకాశ్, తోకల బుచ్చన్న, ఆకుల శ్రీనివాస్, రమేశ్, స్వామి, రవి, భూమన్న, గోపాల్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులున్నారు.

భైంసాటౌన్: సస్పెన్షన్ చేశారనే కారణంతో పలువురు ఎంపీలు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కడ్‌ను హేళన చేస్తూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం బాధాకరమని బీజేపీ నాయకులు అన్నారు. ఈమేరకు టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు గోపాల్ సర్డా, పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, పోశెట్టి, బాలాజీ సూత్రావే, అనిల్, వెంకటేశ్ తదితరులున్నారు.



ఖానాపూర్‌లో నల్లగంతలు కట్టుకున్న నేతలు



భైంసాలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నల్లబ్యాడ్జీలతో నిరసన

లక్ష్మణచాంద: ఉపరాష్ట్రపతిని ప్రతిపక్షాల ఎంపీలు హేళన చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో బీజేపీ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ మండలాధ్యక్షులు పొలాస గోవర్ధన్, ఉపాధ్యక్షులు రంజిత్, మండల ప్రధాన కార్యదర్శి అల్లూరి రాజు, నాగుల రాజు, రాజేశ్వర్, ఏలేశ్వర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో..

కుంటాల: ఉపరాష్ట్రపతి ప్రతిష్టను దెబ్బతీసేలా పలువురు టీఎంసీ, కాంగ్రెస్ ఎంపీలు ప్రవర్తించడాన్ని నిరసిస్తూ కుంటాలలో బీజేపీ నాయకులు తహసీల్దార్ అహ్మద్ ఎజాజ్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్, బీజేపీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య, నవీన్, గజేందర్, శివ, రమణారావు, మాధవరావు గోవర్ధన్, డా.శ్రీనివాస్, అరవింద్‌రావు, వికాస్‌రావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా అయ్యప్ప ఆరట్టు

ఖానాపూర్: పట్టణంలో గురువారం అయ్యప్ప అరట్టు మహోత్సవం కనుల పండువగా సాగింది. అయ్యప్ప ఆలయం నుంచి ప్రధాన రహదారి గుండా గోదావరి తీరం వరకు స్వాములు ఉత్సవమూర్తులతో శోభాయాత్ర నిర్వహించారు. గురుస్వామి పాపారావు, పండితులు నితీశ్, విజయ్‌తోపాటు అరట్టు ఉత్సవం దాత రామునాయక్, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో గోదావరిలో ఉత్సవ మూర్తులకు జలాభిషేకంతోపాటు తెప్పోత్సవం, పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈసందర్భంగా గోదావరి సమీపంలోని ఆలయం వద్ద భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న, గౌరవ అధ్యక్షుడు కొత్తపెల్లి సురేశ్, తదితరులు ఉన్నారు.



ఖానాపూర్‌లో స్వామివారి శోభాయాత్రలో భక్తులు

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్ చౌరస్తా సమీపంలో బుధవారం రాత్రి అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన చిన్నపిల్లల వైద్యులు అనిల్‌జాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా గురుస్వాములు మంత్రి సాయినాథ్, కుంట శ్రీనివాస్, భండారి సందీప్ పాల్గొన్నారు. అభిషేకం, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప స్వాముల భజనలతో ప్రాంగణం మార్మోగింది. భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదం స్వీకరించారు.

గుండంపల్లిలో..



ఖానాపూర్ : తెప్పపై స్వామివారికి జలాభిషేకం




భైంసాలో పడిపూజలో పాల్గొన్న స్వాములు

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వైభవంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, ఆయన సతీమణి గ్రామ సర్పంచ్ సంగీత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్వాములు చేసిన భజనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

‘విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ పోరాటం’

నిర్మల్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందని సంఘటన కార్యదర్శి రాజు సాగర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానం కొనసాగిస్తుందని.. విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ఏబీవీపీ నగర అధ్యక్షుడిగా నవీన్, కార్యదర్శిగా అఖిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇందూరు విభాగ్ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, జిల్లా కన్వీనర్ శశి, దినేశ్, సహస్ర, అంజలి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏబీవీపీ కార్యకర్తలు

వీరహనుమాన్ ఆలయ వార్షికోత్సవం

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీవీరహనుమాన్ ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్నకు అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి కార్యక్రమాలను గురుస్వామి భుజంగం గణపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జుట్టు లక్ష్మణ్, గురుస్వాములు కడార్ల హరిప్రసాద్, నవీన్, అన్వేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలో శుక్రవారం సంతాన గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిష్ఠాపనలో భాగంగా గురువారం యజ్ఞం, ఫలాదివాసం, ధాన్యాదివాసం, పూలదివాసం నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. ఎంపీటీసీ కట్ల సింధూజ–సాగర్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

నర్సరీ పనుల్లో వేగం పెంచండి

సోన్: గ్రామాల్లోని నర్సరీల్లో పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో నర్సరీని ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. నర్సరీలో డ్రాగన్‌ఫ్రూట్, జామ, సీతాఫలం వంటి మొక్కల పెంపకం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి భూపాల్‌రెడ్డి, లక్ష్మణ్, మహేశ్వర్, సాగర్, సాయన్న, శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.



నర్సరీ వద్ద ఎంపీడీవో మోహన్‌రెడ్డి, సిబ్బంది

అర్హులను ఓటరు జాబితాలో చేర్చాలి

కుంటాల: వచ్చే నెల ఒకటి నాటికి 18 ఏళ్ల నిండే యువతీ, యువకులను ఓటరు జాబితాలో చేర్చాలని తహసీల్దార్ అహ్మద్ ఎజాజ్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నర్సాపూర్(జి), కుంటాల మండలాల్లోని బీఎల్వోలకు ఓటరు జాబితా ముసాయిదాపై అవగాహన కల్పించారు. ప్రొజెక్టర్ ద్వారా వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీటీ నరేశ్‌గౌడ్, ఆర్‌ఐలు అడెల్లు, సుమలత, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: పకడ్బందీగా ఓటరు జాబితాను రూపొందించాలని మాస్టర్ శిక్షకులు వందన కుమారి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులు మాట్లాడుతూ నూతన ఓటర్లను నమోదు చేసే తీరు వివరించారు. అనంతరం బీఎల్‌వో యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు దేవేందర్, తహసీల్దార్ మోతీరాం, సిబ్బంది ఉన్నారు.



లోకేశ్వరంలో మాట్లాడుతున్న శిక్షకులు వందన

బాధిత కుటుంబానికి సాయం అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో చిన్న భీమన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం వారికి రూ.పదివేల ఆర్థిక సాయం అందించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, నాందేడపు చిన్ను, ఈటెల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దత్త జయంతి



వేడుకలో పాల్గొన్న భక్తులు

కుంటాల: రెండో షిర్డీగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని కల్లూర్ శ్రీదత్త వెంకట సాయిబాబా ఆలయంలో జయంతి ఉత్సవాలు సాగుతున్నాయి. గురువారం ఆలయంలో శ్రీవిఘ్నేశ్వర పూజ, శ్రీదత్త వెంకటసాయి దేవతలకు పూర్ణాభిషేకం, గోపూజ, బాబాకు మంగళస్నానం, అభిషేకం, అలంకరణ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల మహిళలు పాదయాత్రగా ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్‌ఈడీ తెరతో కూడిన వాహనంపై కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయుష్మాన్ భారత్, ఉపాధిహామీ పథకం, పీఎం విశ్వకర్మ, పీఎం ఉజ్వల యోజన, నానో ఎరువులు, జన్‌ధన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు వంటి పథకాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సంకల్ప్ యాత్ర క్యాలెండర్లతో వైద్యఆరోగ్య సిబ్బంది

‘సద్వినియోగం చేసుకోండి’

ముధోల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు తాటివార్ రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తుల వారికి శిక్షణతోపాటు పనిముట్ల కొనుగోలుకు ఆర్థికసాయం అందిస్తారని ఆయన పేర్కొన్నారు. అర్హులైనవారు సమీపంలోని సీఎస్‌సీ సెంటర్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారి వెంట పలువురు నాయకులు పోతన్న తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. ఆదమరిస్తే.. ప్రయాణం గుంతలోకే



భైంసారూరల్: మండలంలోని ఇలేగాం నుంచి ఉమ్రి గ్రామానికి వెళ్లే మార్గంలో భారీ వర్షాలకు రోడ్డు ఓవైపు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడేం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: ఉదయ్‌కుమార్, పీఆర్ ఏఈ, ఫోన్: 72074 74442

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ : జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899